ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 5 డిసెంబరు 2024

రెవెన్యూ సదస్సులపై నేడు జిల్లాస్థాయి సమావేశం

అనంతపురంటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించడం కోసం ఈనెల ఆరో తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించడం కోసం గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టరు వినోద్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నోడల్ ఆఫీసర్లు, రైతు సంఘాలనేతలు ఉదయం 11గంటలకు హాజరు కావాలని కలెక్టరు కోరారు.



కూలిన పాత మిద్దె పైకప్పు

విరిగిపడిన మృత్యువు

మట్టి మిద్దె కూలి ముగ్గురి మృతి

నిర్మాణ దశలో షెడ్డు కూలి మరో ఇద్దరు

ఉమ్మడి జిల్లాలో విషాదం నింపిన ఘటనలు

కుప్పకూలిన మిద్దె నుంచి బయటకు తీసిన మృతదేహాలు



శ్రమజీవుల కుటుంబం. ఉన్న కాస్త పొలంలో సేద్యం చేసుకుంటూ, కూలి పనులకు వెళుతూ సంతోషంగా గడిపేవారు. అమ్మ, కొడుకు, కోడలు, ఇద్దరు మనవరాళ్లు, ఓ మనవడు..! పెద్ద మనవరాలి పెళ్లి ఇటీవలే జరిపించారు. పాతకాలం నాటి మట్టిమిద్దె వారిది..! శిథిలావస్థకు చేరింది. కొత్త ఇంటిని కట్టుకోవాలని అనుకున్నారు. గ్రామంలోని టీడీపీ నాయకుల సాయం కోరారు. వారు సరే అన్నారు. సంతోషంగా ఇంటికి వచ్చి, రాత్రి భోజనం ముగించారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. పొద్దున్నే పనికి పోవాలి..! ఇక నిద్రపోదాం అనుకున్నారు. అమ్మ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకుంది. కొడుకు, కోడలు, మనవరాలు బయట వరండాలో పడుకున్నారు. ఏ అర్ధరాత్రో మిద్దె ముందుభాగం కూలిపోయింది. అమ్మ మినహా.. అందరూ శిథిలాలలో కూరుకుపోయారు. 'కొత్త ఇల్లు' అనగానే.. పాత మిద్దెకు కోపం వచ్చినట్లుంది. ఇన్నాళ్లూ నీడనిచ్చిన గూడు.. వారికి సమాది కట్టింది. అంతటి విషాదాన్ని చూసి ఊరు కన్నీరుపెట్టింది. (వివరాలు 7లో)

నకిలీలకు రుణాలు

ఏడీసీసీబీలో అంతులేని అక్రమాలు

తాడిపత్రి, యాడికి, రాప్తాడులో వెలుగులోకి..

తూతూమంత్రంగా విచారణ.. నివేదికలు

ప్రేక్షకపాత్రకు పరిమితమైన పర్సన్ ఇన్‌చార్జి



ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో (ఏడీసీసీ) తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ పట్టాలకు రుణాలు మంజూరు చేసిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. వజ్రకరూరు, తాడిపత్రి, యాడికి, రాప్తాడులో ఇలా భారీగా అక్రమాలు జరిగాయి. ఆత్మకూరులో నకిలీ పట్టాలతో రుణాలు పొందిన వ్యవహారంలో ప్రధాన కార్యాలయంలోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించారని తేల్చారు. ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఇంకో అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారు. కానీ తూతూమంత్రంగా విచారణ జరిపి, తనకు ఎవరూ సహకరించడం లేదని నివేదికను అందజేసి చేతులు దులుపుకున్నారు. విచారణ అధికారి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి మిలాఖత్ అయ్యారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ ఇద్దరు అధికారులు మొదటి నుంచి సన్నిహితులని, అలాంటప్పుడు వాస్తవాలు ఎలా వెలుగులోకి వస్తాయని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. పాలకవర్గం లేని బ్యాంకునకు జాయింట్ కలెక్టర్‌ను ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. ఆయన కళ్లెదుటే మహాజన సభలో ఒక్కరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. సహకార శాఖ అధికారులు ఆధారాలు చూపించినా, అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారుల్లో ఉన్న విభేదాలను సాకుగా చూపించి, కొందరిని వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

నకిలీలకు రుణాలు

వజ్రకరూరు, తాడిపత్రి, యాడికి, రాప్తాడులో నకిలీ పాసుపుస్తకాలకు రుణాలు ఇచ్చినట్లు గుర్తించారు. తాడిపత్రి బ్రాంచ్ పరిధిలోని 10 సొసైటీల్లో, ప్రధానంగా యాడికి సొసైటీలో నకిలీ పాసుపుస్తకాలకు రుణాలు చెల్లించినట్లు బ్యాంకు అధికారులు తేల్చారు. అయితే బ్యాంకు, సొసైటీ అధికారులు కలిసి ఇలాంటివి నడిపిస్తారని అంటున్నారు. తాజాగా అనంతపురం రామ్‌నగర్ బ్రాంచ్‌లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మరూరు సొసైటీలో లేని భూమిని ఉన్న సృష్టించి 2017లో రుణాలు పొందారు. ఈ వ్యవహారంపై రాప్తాడు పోలీసుస్టేషన్‌లో పంచాయితీ చేశారు. ఆ తరువాత కేసు నమోదు చేశారు. ఇటీవల ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆరా తీసినట్లు సమాచారం.

ఉత్తుత్తి విచారణ

ఆత్మకూరుబ్రాంచ్ పరిధిలోని 2015-16లో ఆరుగురు రైతులకు రూ.30లక్షల వరకు రుణాలు ఇచ్చారు. వారివి అసైన్డ్ పట్టాలని తేల్చారు. తొమ్మిదేళ్లకుగానూ వడ్డీతో కలిపి రుణం రూ.30 లక్షలకు చేరింది. ఈ రుణాల మంజూరులో ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కీలకపాత్రధారి అని సమాచారం. దీనిపై విచారించాలని జిల్లా కేంద్రంలోని ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆయన తూతూమంత్రంగా విచారించి.. నివేదికను అందజేశారు. విచారణకు ఎవరూ సహకరించడం లేదని అందులో పేర్కొన్నట్లు సమాచారం. ఏడాది పొడవునా రైతులకు పంట రుణాలు ఇస్తామని చేసిన ప్రకటన కొందరు అధికారులకు పంట పండిస్తోంది. ఇద్దరు కీలక అధికారులు రుణం చెల్లించే ప్రతి ఫైల్‌కు ఓ రేటు ఫిక్స్ చేశారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు వేర్వేరుగా చెల్లిస్తారు. ఎకరాకు రూ.40వేలు నుంచి పంట ఆధారంగా రూ.80వేలు వరకు చెల్లిస్తున్నారు. ఇందులో 10శాతం ఆ ఇద్దరు అధికారులకు రైతులు ముడుపులు చెల్లించాల్సి వస్తోందని సమాచారం. పర్సెంటేజీ ఇవ్వకుంటే కుంటి సాకులతో రుణాలు ఇవ్వడం లేదని, సొసైటీ, బ్యాంకులు, ప్రధాన కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారని బాధితులు మండిపడుతున్నారు.

ప్రేక్షకపాత్ర

ఏడీసీసీబీకి జాయింట్ కలెక్టర్ ఆరు నెలలుగా పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అవినీతి, అక్రమాలు బయట పడుతున్నా.. పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మహాజన సభలో రైతు రుణాల వడ్డీ రాయితీలో అక్రమాలు జరిగాయని సహకార శాఖ అధికారులు ఆధారాలు చూపించినా చర్యలు తీసుకోలేదు. అధికారుల మధ్య సమన్వయం కుదర్చలేకపోతున్నారు. అలాంటప్పుడు పర్సన్ ఇన్‌చార్జి ఉండి ఏం ప్రయోజనమని రైతులు, ఖాతాదారులు పెదవి విరుస్తున్నారు. కాగా, హైదరాబాద్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లి ఇటీవల వచ్చిన ఓ అధికారి ఉద్యోగుల మధ్య చిచ్చు పెడుతున్నారు. ఆ అధికారి వ్యవహారం కూడా పర్సన్ ఇన్‌చార్జి దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



సహకార సంఘాలు, బ్యాంకులో జరిగే ప్రతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతులతో ముడిపడి ఉన్న బ్యాంకు, సొసైటీలను సక్రమంగా నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఉన్నతాధికారులతో పాటు పాలకవర్గం స్థానంలో ఉన్న పర్సన్ ఇన్‌చార్జికి తెలియజేస్తున్నాం. కొన్నింటిపై విచారణ చేసి అధికారులకు నివేదిక అందజేశాం. ఇందులో ఎటువంటి రహస్యం లేదు. ఒరిజినల్ పట్టాలకే బ్యాంకు, సొసైటీల నుంచి రుణాలు చెల్లిస్తున్నాం. ఎక్కడైనా నకిలీ కనబడితే రుణాలు చెల్లించిన అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

\- సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ

ఫెంగల్ జల్లులు

తడిసిన వరి ధాన్యం

నేలకొరిగిన వరి పైరు



తడిసిన వరి ధాన్యాన్ని చూపుతున్న సోములదొడ్డి రైతులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ ప్రభావంతో జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఐదు మండలాలలో మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. పుట్లూరు మండలంలో 6.4 మి.మీ., బ్రహ్మసముద్రం, యల్లనూరు మండలాలలో 3.2 మి.మీ., కళ్యాణదుర్గం 1.6, గుంతకల్లు 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అనంతపురం నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి రాత్రి దాకా ఆకాశం మేఘావృతమై కనిపించింది. అనంతపురం, యాడికి, పుట్లూరు తదితర ప్రాంతాల్లో తుంపరలు, జల్లులు పడ్డాయి. గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద కోత కోసి ఆరబెట్టిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. ఈదురుగాలులకు 200 ఎకరాల దాకా వరి పంట నేలకొరిగింది. దీంతో కోత సమయంలో ధాన్యం రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రంతో వరి పంట కోతకు ఎకరానికి గంట నుంచి గంటా 20 నిమిషాల సమయం పడుతుంది. నేలకొరిగితే మూడున్న గంటలకు పైగా సమయం పడుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరం వరి కోతకు రూ.3500 వసూలు చేస్తున్నారని, నేలకొరిగిన పంటకు మాత్రం ఎకరానికి రూ.10 వేల దాకా తీసుకుంటారని రైతులు అంటున్నారు.



ఈదురు గాలులకు నేల కొరిగిన వరి పైరు

ఏమిటి.. ఇదంతా?

కేఎస్ఆర్ ఘటనపై లోతైన దర్యాప్తు చేయండి: కలెక్టర్

ఐసీడీఎస్ పీడీ, ఎంఈఓకు ఆదేశం

డీఈఓ, హెచ్‌ఎంను పిలిపించిన

న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కెఎస్ఆర్ హైస్కూల్ టీచర్లను విచారిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌లో జరిగిన ఘటనపై లోతైన దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీఎంఓ అధికారులు ఆదేశించారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లో పలువురు విద్యార్థులను ఓ టీచర్ లైంగికంగా వేధిస్తున్నట్లు ఆడియోలు బయటకు వచ్చాయి. ఓ మహిళా టీచరే ఈ వ్యవహారం అంతా నడిపించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై 'బడిలో లైంగిక వేధింపులు?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఫైర్ అయ్యారు. వెంటనే విచారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ, బుక్కరాయసముద్రం ఎంఈఓను విచారణాధికారులుగా నియమించారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బుక్కరాయసముద్రం ఎంఈఓ నవీద్ హైస్కూల్‌లో బుధవారం ఉదయం నుంచి విచారణ చేశారు. సుమారు 11 మంది విద్యార్థినులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు టీచర్లు, హెచ్‌ఎంను వారు విచారించారు. వివరాలను వారి నుంచి లిఖితపూర్వకంగా రాయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక విచారణ తర్వాత అవసరమైతే గురువారం కూడా విచారణ కొనసాగే అవకాశం ఉంది.

డీఈఓ విచారణలో పెదవి విప్పని టీచర్లు

కేఎస్ఆర్ ఘటనపై డీఈఓ ప్రసాద్‌బాబు వెంటనే స్పందించారు. ఆయన మధ్యాహ్నం హైస్కూల్‌కు వెళ్లి.. టీచర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. లైంగిక వేధింపులు, వరుసగా జరుగుతున్న వ్యవహారాల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. అయితే మహిళా టీచర్లు ఎవరూ పెదవి విప్పలేదని తెలిసింది. ఏం మాట్లాడితే తమకు ఏం సమస్య వస్తుందోనన్న భయంతో ఎవరూ మాట మాట్లాడలేదని సమాచారం. ఎవరు తప్పు చేసినా... చర్యలు కఠినంగా ఉంటాయని డీఈఓ వారిని హెచ్చరించినట్లు తెలిసింది. ప్రశాంతంగా ఉన్న పాఠశాలలో ఇలాంటి వ్యవహారాలను ఎవరు ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని, ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తర్వాత డీఈఓ ప్రసాద్‌బాబు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. లైంగిక వేధింపుల ఘటనపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సైతం స్పందించారు. డీఈఓ ప్రసాద్ బాబు, కేఎస్ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నారాయణను వెంటనే తన వద్దకు రావాలని బుధవారం మధ్యాహ్నం ఆదేశించారు. వారు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన్ను కలిశారు. స్కూల్‌లో ఏం జరిగింది...?, ఎలా జరిగిందన్న అంశాలను ఆయన అధికారులతో ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని, రెండు రోజుల్లో నివేదిక అందజేస్తామని అధికారులు ఆయనకు తెలియజేసినట్లు సమాచారం. ఈ ఘటనపై సీఎంఓ నుంచి కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది. కేఎస్ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులను ఆంధ్రజ్యోతి కథనం ఉక్కిరిబిక్కిరి చేసింది. విచారణాధికారులు కలెక్టర్‌కు గురువారం నివేదిక అందజేస్తారని సమాచారం.


ప్రభుత్వ నిర్ణయం సరికాదు

● బార్ అసోసియేషన్

అనంతపురం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని బార్ అసోసియేషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డీపీఎస్ కేసులకు ప్రతి జిల్లా కోర్టులో ఉండేదని, ఇప్పుడు తిరుపతిలో రాయలసీమ జోన్ కోర్టు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన జిల్లాలవారు తిరుపతికి వెళ్లాల్సి వస్తుందని, కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయాధికారులకు ఇబ్బందికరంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఈ నెల పదో తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తామని అన్నారు.

మట్టిలో మాణిక్యాలు

ఆట ఏదైనా విజయం వారిదే.. క్రీడల్లో రాణిస్తున్న నూతిమడుగు విద్యార్థులు (6లో...)



ఇష్టారాజ్యానికి ఇక చెల్లు...!

సచివాలయంలో సిబ్బంది ఉండాల్సిందే

ఉదయం, సాయంత్రం ముఖహాజరు తప్పనిసరి

ఒకపూట హాజరు వేస్తే అది సెలవు కింద లెక్కే

విధులకు డుమ్మాకొట్టే వారి ఆటలకు ఇక చెక్

7 లో...



నగరంలో కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ చైతన్యవేదిక నాయకులు

మారణకాండకు మూల్యం

తప్పదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు

నగరంలో హిందూ చైతన్య వేదిక ర్యాలీ



అనంతపురం సెంట్రల్/కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హిందువులే లక్ష్యంగా బంగ్లాదేశ్‌లో సాగిస్తున్న మారణకాండకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించక తప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు హెచ్చరించారు. బంగ్లాదేశ్ తీరుకు నిరసనగా నగరంలో బుధవారం కాగడాల ర్యాలీ నిర్వహించారు. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీకి సందిరెడ్డి శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల విషయంపై హసీనా నాయకత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరిగాయని అన్నారు. ఈ అల్లర్లను హిందువులవైపు మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆ దేశంలోని హిందూ మహిళల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్‌ను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడం నుంచి నేటి వరకు ఆ దేశ అభివృద్ధికి భారత్ ఎనలేని సహాయ, సహకారాలు అందిస్తోందని అన్నారు. కూర్చున్న కొమ్మను బంగ్లాదేశ్ నరుక్కుంటోందని, హిందువులపై దాడులకు తెగబడుతోందని అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అన్నార్థుల ఆకలిని తీరుస్తున్నారని, ఇస్కాన్ పూజారి చిన్మోయ్ కృష్ణదాసు ఆధ్వర్యంలో దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌లో సేవలు అందిస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిని దేశ ద్రోహిగా చిత్రీకరించడం, ఆయన తరపున వాదిస్తున్న న్యాయవాదిని హత్యచేయడం అమానవీయమని అన్నారు. ఆ దేశాధినేత స్పందించి, హిందువులపై దాడులను ఆగేలా చూడాలని, లేదంటే తీవ్ర పరిణామలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

హిందువులు ఏకతాటిపైకి రావాలి: దేవేందర్

దాడులను అరికట్టేందుకు హిందువులు ఏకతాటిపైకి రావాలని హిందూ చైతన్య వేదిక అఖిల భారత సంయోజక్ దేవేందర్ పిలుపునిచ్చారు. జాతీయ పతాకం చేబూని ఆయన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని తిప్పికొట్టేందుకు హిందువులంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తాలంకి వెంకటరత్నమయ్య, రమణబాబు, విశ్వేశ్వర రెడ్డి, చిరంజీవి రెడ్డి, హిమకర్, విజయ్, రమణ మాబు, రత్నమయ్య, జగదీష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్‌కు అనూష

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళా జట్టు ప్రాబబుల్స్‌కు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూష ఎంపికయ్యారు.


అనూష

ఆత్మకూరు గ్రామానికి చెందిన అనూష ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇప్పటికే ఆమె అనేక రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. గతేడాది కూడా అండర్-19 భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో ఆమె చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్ సాధన చేస్తున్నారు. భారత జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక కావడంతో బెంగళూరులో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి వెళ్లారు. అనూషాను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అభినందించారు.

రోశయ్యకు భారతరత్న ప్రకటించాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు గోపా మచ్చా నరసింహులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆర్యవైశ్య మహాసభ నాయకుడు, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు డిమాండ్ చేశారు. కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి పురస్కరించుకుని బుధవారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణమండపంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్య జన్మించిన గుంటూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ లోని వైశ్య హాస్టల్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి టంగుటూరు నాగభూషణ, సత్రసాల కిషోర్, తల్లం మురళీకృష్ణ, కృష్ణం రఘు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.


రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

హనకనహాళ్‌లో ప్రబలిన జ్వరాలు

కణేకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాల తీవ్రత పెరగింది. దీంతో బాధితులు చికిత్స కోసం బెళుగుప్ప, కళ్యాణదుర్గం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, వరుణ్‌తేజ్, జ్యోత్స్న, తిమ్మరాజు తదితరులకు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రావడంతో కళ్యాణదుర్గంలో చికిత్సలు పొంది బుధవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లోను జ్వర పీడితులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జ్యోత్స్న


రామాంజనేయులు


తిమ్మరాజులు


వరుణ్‌తేజ్

ఆ పాఠశాల విద్యార్థులు బరిలోకి దిగితే పతకం కొట్టాల్సిందే. ప్రత్యర్థి ఎవరైనా విజయం మాత్రం వారిదే. ఇదేదో పట్టణాలు, నగరాల్లో పేరొందిన కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల ప్రతిభ మాత్రం కాదు. జిల్లాలోని మారుమూల గ్రామం నూతిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల్లో అద్భుతమైన ప్రతిభ చూపుతున్నారు. పీడీ కోచింగ్, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పతకాలు పట్టేస్తున్నారు. మెరుగైన ఆటతీరుతో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఈ పాఠశాల విద్యార్థులు 43 మంది అద్భుత ప్రదర్శన చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం




ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నూతిమడుగు పాఠశాల విద్యార్థులు

మట్టిలో మాణిక్యాలు

ఆట ఏదైనా విజయం వారిదే..





రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు

క్రీడల్లో రాణిస్తున్న నూతిమడుగు విద్యార్థులు

జాతీయ స్థాయిలో ఆడుతా: ఖాసీం, తొమ్మిదో తరగతి



ఈ ఏడాది వాలీబాల్, సాఫ్ట్‌బాల్ గేమ్‌లలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో సాఫ్ట్‌బాల్ గేమ్‌లో జాతీయ జట్టులో స్థానం సంపాదించడం లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఎప్పటికైనా జాతీయ స్థాయిలో ఆడుతా.

మెడికల్ సీట్ సంపాదించడమే లక్ష్యం



సాఫ్ట్ బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నా. మా పీడీలు ఓబులేసు, సంజీవరాయుడు ఇచ్చిన శిక్షణతో జాతీయ స్థాయిలో కూడా ఒకసారి పాల్గొన్నా. భవిష్యత్తులో క్రీడల ద్వారా మెడికల్ సీట్ సంపాదించటమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.

-ఆశాబేగం, తొమ్మిదో తరగతి

మూడుసార్లు రాష్ట్రస్థాయిలో ఆడా



సాఫ్ట్ బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ జట్టులో స్థానం కోసం ప్రాక్టీస్ చేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు నాతో రోజు ప్రాక్టీస్ చేయించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దారు.

-వసంత్, పదో తరగతి

ఖోఖోలో జాతీయస్థాయిలో రాణిస్తా



ఈ నెల 6 నుంచి 8 వరకు చిత్తూరులో జరిగే ఖోఖో రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల్లో పాల్గొనబోతున్నా. అక్కడ బాగా రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.

-ప్రణవి, ఎనిమిదో తరగతి

అందరూ గ్రామీణ విద్యార్థులే

ఈ పాఠశాల్లో చదివే విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంత విద్యార్థులే. ఈ పాఠశాల పరిధిలో ఏడు మారుమూల గ్రామాల పరిధిలోని విద్యార్థులు ఉన్నారు. ఈ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా ఆటల్లో సైతం ఆసక్తి కనబరిచి, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులు ప్రతిరోజు పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. ప్రతి రోజు మధ్యాహ్నం తర్వాత పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. నిత్య సాధనతోనే విజయాలు సాధ్యమవుతున్నాయని పాఠశాల పీడీలు చెబుతున్నారు.

విజయాల వెనుక ఇద్దరు పీడీలు

ఒకప్పుడు ఈ పాఠశాలలో పిల్లలకు ఆసక్తి ఉన్నా క్రీడలకు అంతగా ప్రాధాన్యం ఉండేది కాదు. పీడీలు ఉన్నా ఏదో సాధారణంగా గడిచిపోయేది. కాని రెండేళ్ల కిందట ఇక్కడ పీడీలుగా ఓబుళపతి, సంజీవరాయుడు బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆటల్లో పాఠశాల తీరే మారిపోయింది. వారిద్దరూ కలిసి మట్టిలో మాణిక్యాలను గుర్తించి, తమ శిక్షణతో సానపట్టారు. దాని ఫలితమే ఇప్పుడు వస్తున్న పతకాలు అని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వివిధ క్రీడల గురించి, అందులోని మెలకువల గురించి ఎప్పటికప్పుడు వివరించి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటేలా చూస్తున్నారు. ఇదే స్ఫూర్తితోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించగలమని విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పేర్కొన్నారు. అయితే పాఠశాలకు సరైన మైదానం లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. దాతలు ముందుకు వచ్చి క్రీడామైదానాన్ని బాగు చేయించి, క్రీడలకు సహకరిస్తే ఇక్కడి విద్యార్థులు అద్భుతాలు చేయగలరని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రెండేళ్ల నుంచి రాష్ట్రస్థాయికి 70 మంది..

గత రెండేళ్ల నుంచి ఈ పాఠశాల్లో విద్యార్థిని, విద్యార్థులు 70 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బ్యాల్, ఆర్చరీ (విలువిద్య), వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై ఈ పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కూడా నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి గుర్తింపు పొందారు. గత రెండుమూడేళ్లలోనే దాదాపు 250 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా అత్యున్నత ప్రతిభాపాటవాలు సాధించారు. 8, 9, 10 వ తరగతికి చెందిన 44 మందికి పైబడి బాలురు, 30 మందికి పైబడి బాలికలు కూడా వివిధ ఆటల్లో తమ ప్రతిభ చూపుతున్నారు. బాలికలు కూడా బాలురతో సమానంగా క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం ఇక్కడ విశేషం.



70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడారు



నేను, ఇక్కడ పనిచేసే మరో పీడీ సంజీవరాయుడు ఇద్దరం రెండేళ్ల కిందట ఈ పాఠశాలకు వచ్చాం. అప్పటి నుంచి సుమారు 70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఒక అమ్మాయి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యింది. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, ఆర్చరీ (విలు విద్య), వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో రెండేళ్ల నుంచి తర్ఫీదు ఇస్తున్నాం. ఆర్చరీ వంటి పురాతన క్రీడ ఈ పాఠశాలలో ఉండటం ఒక విశేషం. ఎంతో ఖరీదైన ఆటలు అయిన ఆర్చరీ, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషించదగ్గ విషయం.

- ఓబులేసు, పీడీ, ఉన్నత పాఠశాల, నూతిమడుగు, కంబదూరు మండలం

అడ్మిషన్ దొరికితే చాలు

పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 716 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో అడ్మిషన్ దొరికితే చాలని తల్లిదండ్రులు ఎగబడుతుంటారు. ఈ ఏడాదే అన్ని తరగతుల్లో కలిపి 270 మంది అడ్మిషన్ పొందారు. దీన్నిబట్టే పాఠశాల స్థాయిని తెలుసుకోవచ్చు. క్రీడలతో పాటు, చదువులో కూడా పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, పాల్‌టెక్నిక్, ఏపీఆర్‌జేసీ, ఆర్డీటీ సెట్‌లో కూడా ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. పదో తరగతిలో కూడా మంచి ఫలితాలు వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పడానికి ఆసక్తి చూపుతున్నారు.

దాతలు సహకరించాలి



నేను రెండేళ్ల నుంచి హెచ్ఎంగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, మంచి శిక్షణ ఇవ్వడంతోనే ఇంతటి విజయానికి సాధ్యం అయింది. దాతలు ముందుకు వచ్చి మరింత క్రీడాసామగ్రిని సమకూర్చినట్లయితే జాతీయ స్థాయిలో విద్యార్థినీవిద్యార్థులను తీసుకెళ్లేందుకు కష్టపడతాం.

-రాజశేఖర్‌రెడ్డి, హెచ్ఎం

కోతలు లేని విద్యుత్ సరఫరా

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోతలు లేని విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి ఆయన అన్ని అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయలను పూర్తిగా నివారించాలన్నారు. వేసవి ప్రారంభంలోపు వినియోగదారులకు కరెంటు సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరం మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పాత లైన్ల స్థానంలో కొత్త లైన్ లాగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ కలెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సామగ్రి ఈనెల చివరికి వస్తుందన్నారు. అప్పటికి ఎస్టిమేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, ఈఈలు ప్రసాద్, రాజశేఖర్, జేవీ రమేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు డీపీఆర్సీలో శిక్షణ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5,6 తేదీల్లో జడ్పీ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో రెండు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ట్రైనర్లు అయిన ఈవోఆర్డీలు, పంచాతీయ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాస్థాయి శిక్షణ తర్వాత ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ మండలాల్లోని ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


మజ్దూర్ యూనియన్ శిబిరం


ఎంప్లాయీస్ సంఘ్ శిబిరం

ప్రారంభమైన రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికలు

గుంతకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభం అయ్యింది. రైల్వే ఉద్యోగుల ఓటింగ్ కార్యక్రమం ఈనెల 4, 5, 6 తేదీల్లో చేపట్టనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో 6 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డివిజన్‌లో 14,359 ఓట్లు ఉండగా, సాయంత్రందాకా నిర్వహించిన పోలింగ్‌లో 7,591 ఓట్లు పోలయ్యాయి. మొదటి రోజు సాయంత్రానికి 52.87 శాతం పోలింగ్ నమోదైనట్టు పర్సనల్ శాఖాధికారులు తెలియజేశారు. పోలింగ్ సందర్భంగా రైల్వే ఏరియాలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యాల్లో ఓటింగ్ సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకూ రైల్వే ఇన్‌స్టిట్యూట్, డీఆర్ఎం కార్యాలయాల వద్ద ఉద్యోగుల కోలాహలం కనిపించింది. ఓటింగ్ కార్యక్రమాన్ని డీఆర్ఎం విజయ కుమార్, సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, తదితర ఎన్నికల అధికారులు, యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ కే మల్లికార్జున, తదితరులు పర్యవేక్షించారు.

తెగుళ్ల ఉద్ధృతి

కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు

ఆవిరవుతున్న రైతన్న ఆశలు


కందిపూత దశలోనే ఆశించిన పురుగు, కాయను తొలుస్తున్న పచ్చపురుగు, వేరుకుళ్లు తెగులుతో నాశనమైన పప్పుశనగ

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో కంది, పప్పుశనగ రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. పూత దశలో ఉన్న కంది పంటను పచ్చపురుగు ఆశించింది. పూత, పిందెలను తినేస్తోంది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. పురుగు నివారణకు క్లోరంట్రినిల్‌ప్రోల్ ఎకరాకు 60 ఎంఎల్ లేదా స్పైనోశాడ్ 60 ఎంఎల్, ప్రొటానోపాస్ 400 ఎకరాకు 400 ఎంఎల్, బెంజోయెట్ ఎకరాకు 80 ఎంఎల్ మందులు పిచికారి చేయాలని వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ సూచించారు. మండలంలో 16,600 ఎకరాలలో పప్పుశనగ సాగు చేశారు. అయితే తేమ అధికావడంతో వేరుకుళ్లు వ్యాధి సోకి మొక్కన్నీ చనిపోతున్నాయి. నివారణకు సాఫ్ లేదా హెక్సా కోనజోల్ లేదా ప్రొపికోనోజోల్ ఎకరానికి 400 గ్రాముల పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. మొక్క పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలని, తేమశాతం ఎక్కువగా ఉన్నందున మొక్కల వేళ్ల నల్లగా వుండి పైరు నాశనమవుతోందని ఏఓ తెలిపారు.

ఆశలన్నీ నీరుగారుతున్నాయి



కంది, పప్పుశనగ పంటలపై పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారుతున్నాయి. కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. 30 ఎకరాల్లో కంది, 20 ఎకరాల్లో పప్పుశనగ పంటలు సాగు చేశా. వర్షాలు కురిసినా ప్రయోజనం లేకుండా పోయింది. దిక్కుతోచడం లేదు. దేవుడు కరుణించి వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కే అవకాశం ఉంటుంది. -యర్రిస్వామి, రైతు, ఎర్రగుడి

చిరస్మరణీయుడు ఘంటసాల

వెంకటేశ్వరరావుకు ఘన నివాళి


ఘంటసాల విగ్రహం వద్ద కళాకారుల నివాళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): తన గాన మాధుర్యంతో తెలుగు సినీ సంగీత ప్రియులను అలరించిన ఘంటసాల చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఘంటసాల పాడిన పాటలను ఆలపిస్తూ అలనాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్, అస్లాం బాషా, సురభి ఆనంద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

● హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పాతపాటల ప్రేమికుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాయనీ గాయకులు ఘంటసాల పాటలు ఆలపిస్తూ స్వరనీరాజనం పలికారు. కార్యక్రమంలో పాతపాటల ప్రేమికుల సంఘం నాయకులు జీవి రామయ్య, ఓబుళదాస్, పాలసముద్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రవేశాలు కల్పిస్తే చర్యలు: ఆర్ఐఓ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీయట్ కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ హెచ్చరించారు. నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్‌లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను, ఇతర ఫైళ్లను పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేయకముందు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఎవరూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టకూడదన్నారు. ఎవరైనా అడ్మిషన్లు చేస్తే బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. 2025 మార్చి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈ నెలా 5లోపు చెల్లించేలా చూడాలని ఆయన ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 2025 ఫిబ్రవరి మొదటివారంలో ఇంటర్ ప్రాక్టికల్స్ ఉంటాయని, అన్ని యాజమాన్య కళాశాలల ప్రిన్సిపాళ్లు జనవరి 31లోగా సిలబస్, ప్రయోగాలు పూర్తి చేయాలని, రికార్డులను సర్టిపై చేయాలని ఆదేశించారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 28, కనిష్ఠ ధర రూ. 23 పలికినట్లు ఆయన తెలిపారు.

వర్షాల సమయంలో పంట కోతలు వద్దు: ఏడీఏ రవి

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడే సమయాల్లో పంట కోతలు మొదలు పెట్టవద్దని అనంతపురం ఏడీఏ రవి సూచించారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి, గార్లదిన్నె మండలాల్లో పంట కోత తర్వాత తడిసిన వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడే సూచనలు ఉన్న సమయాల్లో వరితోపాటు ఇతర రకాల పంటను ఎట్టిపరిస్థితుల్లోనూ కోత కోయకూడదన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటనష్టాన్ని నివారించుకోవచ్చునన్నారు. పంట కోసిన తర్వాత దిగుబడులు తడిసిపోతే పంటనష్టపరిహారం వర్తించదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 931 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ -2కు 837 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

క్రైంకార్నర్

యువతి ఆత్మహత్య


తనూజ (ఫైల్)

రాయదుర్గం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పైతోట ఏరియాలో రైలు నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడం పట్టణానికి చెందిన తనూజ(20) మెడికల్ సీటు రాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. ఈక్రమంలోనే మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. కుటుంబసభ్యులు ఆందోళన చెంది కర్ణాటకలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆమె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం ఉదయం పైతోట సమీపంలో రైల్వే గ్యాంగ్‌మెన్ నాగేష్ ఓ యువతి మృతదేహం చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వేపోలీసులు ఆ యువతి వివరాల కోసం దర్యాప్తు చేపట్టగా, అది తనూజ మృతదేహంగా గుర్తించి ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మహిళపై కత్తితో దాడి


గాయపడిన నాజియా

గుత్తి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కమటా వీధికి చెందిన నాజియా అనే వివాహితపై అదే కాలనీకి చెందిన లారీ డ్రైవర్ దాదా ఖలందర్ బుధవారం కత్తితో దాడి చేశాడు. నాజియా కూలీ పనుల కోసం బండగేరికి వెళ్తుండగా దాదాఖలందర్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు గాయపడిన నాజియాను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

కూడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూడేరు గ్రామపంచాయతీ టీడీపీ మద్దతు సర్పంచ్ లలితమ్మ బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వచ్చిన భర్త ఈశ్వరయ్య ఫ్యానుకు వేలాడుతున్న ఆమెను చూసి వెంటనే కిందికి దింపాడు. తర్వాత చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వైద్యులు తెలిపారు. సీఐ రాజు ఇంకా ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విరిగిపడిన మృత్యువు

మట్టి మిద్దె కూలి ముగ్గురి మృతి

నిర్మాణ దశలో షెడ్డు కూలి మరో ఇద్దరు

ఉమ్మడి జిల్లాలో విషాదం నింపిన ఘటనలు


మట్టిలో కూరుకుపోయిన ముగ్గురి మృతదేహాలు


కురుబ గంగన్న, కురుబ శ్రీదేవి, సంధ్య (ఫైల్ ఫొటోలు)

కుందుర్పి/చిలమత్తూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పాత మిద్దె, నిర్మాణ దశలో ఉన్న షెడ్ కూలిపోయి ఐదుగురు మృతిచెందారు. కుందుర్పి మండలంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, చిలమత్తూరు మండలంలో ఓ రైతు, కూలీ ప్రాణాలు కోల్పోయారు. కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామంలో మట్టిమిద్దె వరండా కూలిపోవడంతో గ్రామానికి చెందిన కురుబ గంగన్న (48), ఆయన భార్య శ్రీదేవి (40), కూతురు సంధ్య(15) మృతి చెందారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి మంగళవారం రాత్రి భోజనం చేసి, కబుర్లు చెప్పుకున్నారు. నిద్ర రావడంతో పది గంటల తరువాత వరండాలో తమ కూతురితో కలిసి దంపతులు ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. లోపలి గదిలో (వంట గది) గంగన్న తల్లి ముత్యాలమ్మ నిద్రించారు. ఆమె బుధవారం ఉదయం నిద్రలేచి, తలుపులు తీసేసరికి వరండా మొత్తం కూలిపోయి కనిపించింది. దీంతో భయాందోళనకు గురై.. గట్టిగా కేకలు వేయడంతో ఇరుగూపొరుగు వచ్చి చూశారు. శిథిలాలను తొలగించి చూసేసరికి ముగ్గురూ మృతిచెందారు. అర్ధరాత్రి, గాఢ నిద్రలో ఉన్న సమయంలో మిద్దె కూలిపోయినట్లుందని, అందుకే తెల్లవారేదాకా ఈ విషయం ఎవరికీ తెలియలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, దీంతో మట్టిమిద్దె తడిసి కూలిపోయిందని అన్నారు. శిథిలాల కింద కూరుకుపోయి ఊపిరి ఆడక ముగ్గురూ మృతిచెందారు.

కొత్త ఇంటికి దరఖాస్తు చేసి..

మట్టి మిద్దె పాతబడటంతో పక్కా ఇంటికోసం గంగన్న దరఖాస్తు చేయాలని భావించాడు. గ్రామంలోని టీడీపీ నాయకులకు మంగళవారం రాత్రి తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, ఫొటోలు తదితరాలను ఇచ్చి వచ్చాడు. తనకు కొత్త ఇంటిని మంజూరు చేయించాలని వారికి విన్నవించాడు. కానీ తెల్లవారేలోగా ఘోరం జరిగిందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళుతూ కష్టపడి బతికేవారని అన్నారు. వైసీపీ హయాంలో పక్కా ఇంటిని మంజూరు చేసి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలియగానే గ్రామానికి వెళ్లి పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మిగిలింది అవ్వ.. మనవడు..

గంగన్న, శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు మల్లీశ్వరికి ఇటీవలే వివాహం జరిపించారు. చిన్నకూతురు సంధ్య ఎనుములదొడ్డి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. కుమారుడు ఈశ్వర్ పదో తరగతి తరువాత చదువు మానేశాడు. కూలి పనులకు వెళుతూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. టమోటా బాక్సులను మోసే పని ఉండటంతో మంగళవారం రాత్రి అనంతపురం టమోటా మార్కెట్‌కు వెళ్లాడు. ప్రమాదం గురించి తెలుసుకుని గ్రామానికి చేరుకుని కన్నీటిపర్యంతం అయ్యాడు. ఆ ఇంట్లో అవ్వ, మనవడు మాత్రమే ప్రాణాలతో మిగిలారు.

నారా లోకేశ్ దిగ్భ్రాంతి

మిద్దె కూలి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంత్రి నారా లోకేశ్ ఫోన్లో వివరించారు. దీంతో మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50 వేలు అందచేశారు. ఈశ్వర్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ నాయకులు పాలబండ్ల శ్రీరాములు, ధనుంజయ, రాఘవేంద్రబాబు, మల్లికార్జున, శేఖర్‌గౌడ్, ప్రసాదు, దీనమ్మ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గంగన్న, శ్రీదేవి దంపతులు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.


బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

శెట్టిపల్లిలో ఇద్దరు..


లక్ష్మీనారాయణరెడ్డి, శివారెడ్డి (ఫైల్‌ఫొటోలు)

వ్యవసాయ పనిముట్లను భద్రపరిచేందుకు నిర్మిస్తున్న షెడ్ కూలడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. శెట్టిపల్లికి చెందిన రైతు శివారెడ్డి తన పొలంలో షెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. గోడలు పూర్తి కావడంతో బుధవారం పైకప్పు పనులు ప్రారంభించారు. గోడలపై ఇనుప దూలాలు వేసి, వాటిపై నాపరాళ్లను పరిచి, సిమెంట్ కాంక్రీట్ వేస్తుండగా బరువు తట్టుకోలేక ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. దీంతో పై భాగంలో నిలబడి పనిచేస్తున్న శివారెడ్డి (65), ఆయన కుమారుడు రాజశేఖర్ రెడ్డి, కూలీ లక్ష్మీనారాయణరెడ్డి(50) తీవ్రంగా గాయపడ్డారు. అక్కడున్నవారు శకలాలను తొలగించి ముగ్గురినీ బయటకు తీశారు. అప్పటికే లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో శివారెడ్డి మృతి చెందారు. రాజశేఖర్ రెడ్డిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జగన్ వద్ద పురం పంచాయితీ

ఇరువర్గాల వాదనలు విన్న అధినేత

త్వరలోనే పురానికి దూతలు

విభేదాలపై అసహనం

హిందూపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా హిందూపురం వైసీపీలో విభేదాలు మాత్రం అలాగే ఉన్నాయి. ఏ గ్రూపు ఉన్నా ఏడాదిలో రెండు సార్లయినా ఇన్‌చార్జి పదవికోసం హిందూపురం నాయకులు అధినేత జగన్ వద్దకు పంచాయితీకి వెళ్తారు. ప్రస్తుతం కూడా అదే జరిగింది. బుధవారం తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత జగన్‌ను వైసీపీ పురం ఇన్‌చార్జి దీపిక వర్గంతోపాటు ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆయన వర్గంలోని ముఖ్య నాయకులు కొందరు కలిశారు.

పరస్పరం ఫిర్యాదులు

నవీన్‌నిశ్చల్, దీపిక వర్గాలకు చెందిన నాయకులు వేర్వేరుగా జగన్‌ను కలిసి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. నవీన్ వర్గం నుంచి మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ బలరాంరెడ్డి, లేపాక్షి మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, శెట్టిపల్లి ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ నవీన్‌తోపాటు కలిశారు. దీపికపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎన్నికల అనంతరం ఇన్‌చార్జి దీపిక.. కార్యకర్తలకు అందుబాటులో ఉండట్లేదనీ, ఏదైనా సమస్య వస్తే ఫోన్‌లో సైతం స్పందించరని చెప్పినట్లు తెలిసింది. ఇన్‌చార్జి వద్ద ఉన్న ఒకరిద్దరు చెప్పినట్లు వారు వ్యవహరిస్తున్నారనీ, దీంతో పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తమ పరిస్థితి ఏంటని వాపోయినట్లు తెలిసింది. వారంలో ఒకట్రెండు రోజులు కూడా హిందూపురంలో అందుబాటులో ఉండరనీ, అలాంటివారు ఇన్‌చార్జిగా ఉంటే పార్టీ నాశనం అవుతుందని చెప్పినట్లు సమాచారం.

నవీన్‌పై చర్యలు తీసుకోవాలి

జగన్‌ను పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీతోపాటు ఇన్‌చార్జి దీపిక, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, కౌన్సిలర్ శివ, మరికొంతమంది నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ.. నవీన్‌నిశ్చల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనీ, ఎన్నికల అనంతరం పార్టీ కార్యక్రమాలు అంతంత మాత్రంగా చేస్తున్నారని జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇన్‌చార్జి ప్రమేయం లేకుండా మండల కన్వీనర్లను ఎంపిక చేస్తున్నట్లు, ఇటీవల నవీన్‌నిశ్చల్ కార్యాలయంలో లేపాక్షి నాయకులు సమావేశం అయిన ఫొటోలను జగన్‌కు చూపించినట్లు తెలిసింది. ఇన్‌చార్జి అనే గౌరవం నవీన్ వర్గీయులకు ఏమాత్రం లేదనీ, ఫలితంగా పార్టీలో క్రమశిక్షణ తప్పుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల హిందూపురంలో నవీన్‌నిశ్చల్ వేసిన ఫ్లెక్సీల్లో పార్టీకి సంబంధించిన బొమ్మలు లేవని చెప్పినట్లు తెలిసింది.

అధినేత అసహనం

రెండువర్గాల నాయకుల వాదనలు విన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నా.. లేకున్నా.. హిందూపురంలో వర్గపోరు ఉండటం ఏంటని అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాలు చేయకుండా పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం సబబుకాదని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అందరూ కలిసి తన వద్దకు రావాలే తప్ప.. ఇలా ఫిర్యాదులు చేయడానికి రాకూడదని పేర్కొన్నట్లు సమాచారం. హిందూపురం వైసీపీలో నెలకొన్న వర్గవిభేదాలను చక్కదిద్ది ఏకనాయకత్వం చేసేందుకు సజ్జలగానీ, మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలోగానీ దూతలను హిందూపురానికి పంపనున్నట్లు జగన్.. రెండువర్గాలకు చెప్పినట్లు సమాచారం. త్వరలోనే హిందూపురానికి దూతలు రానున్నారు. జగన్‌ను కలిసేందుకు నవీన్‌కు సజ్జల, దీపిక వర్గానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ అవకాశం ఇప్పించినట్లు తెలిసింది.

వ్యవసాయ నిర్మాణాలకు రాయితీ

కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్స్ ఏర్పాటుకు వర్తింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రాయితీని కల్పించినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు మార్కెట్ చేసుకునేందుకు అనువుగా గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి ఎగుమతి చేసుకునేందుకు కావాల్సిన కలెక్షన్ సెంటర్స్‌ను 40 శాతం రాయితీపై మంజూరు చేస్తారన్నారు. ఉద్యాన పంటలు, కూరగాయలు కోత కోసిన తర్వాత నేరుగా లారీలు, ట్రాక్టర్ల ద్వారా లోడ్ చేసి అన్ని రకాల సైజు కాయలను ఒకే ధరకు విక్రయించడం ద్వారా రైతులు నష్టపోతున్నారన్నారు. కలెక్షన్ సెంటర్‌లను రైతులు ఏర్పాటు చేసుకొని, పంట కోసిన తర్వాత గ్రేడింగ్ చేయడంతోపాటు అట్టపెట్టెల్లో ప్యాక్ చేసుకొని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటే అధిక ధరను పొందవచ్చునన్నారు. కలెక్షన్ సెంటర్లను 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 15 అడుగుల ఎత్తు కొలతలతో నిర్మించుకోవాలన్నారు ట్రాక్టర్, చిన్న సైజు ఆటోలు కలెక్షన్ సెంటర్‌లోకి వచ్చివెళ్లేందుకు వీలుగా రెండు వైపులా షట్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆరు కిటికీలు ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత కలెక్షన్ సెంటర్‌లో గ్రేడింగ్ టేబుల్, ప్లాస్టిక్ క్రేట్లు, వేయింగ్‌మిషన్, ఇన్వర్టర్, టేబుళ్లు, కుర్చీలు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందు కోసం రూ.15 లక్షల ఖర్చు అవుతుందని, ఇందులో 40 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారన్నారు. కోల్డ్ రూం ఏర్పాటు కోసం 35 శాతం రాయితీ వర్తింపజేస్తారని తెలిపారు. 10 టన్నుల కెపాసిటీ కలిగిన సోలార్ కోల్డ్ రూం ఏర్పాటు కోసం రూ.12.50 లక్షలు ఖర్చు అవుతుందని, ఇందులో 35 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ కోల్డ్ రూంలో ఉద్యాన పంటలు, పచ్చళ్లు, పొడులు, పూలు తదితర వాటిని నిల్వ చేసుకోవచ్చని తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌లో మామిడి, టమోటా పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పంటనష్టం జరిగితే రైతులను ఆదుకునేందుకు వాతావరణ ఆధారిత బీమాను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మామిడికి ఎకరాకు రూ.1650 ప్రీమియం చెల్లిస్తే రూ.33వేలు పంటల బీమా వర్తింపజేస్తారన్నారు. టమోటా ఎకరాకు రూ.1600 చెల్లిస్తే రూ.32వేలు ప్రీమియం వర్తిస్తుందన్నారు. ఈనెల 15లోపు రైతులు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. బ్యాంక్ లేదా కామన్ సర్వీస్ సెంటర్, మీసేవా, బీమా కంపెనీ నియమించిన మధ్యవర్తుల ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు నేరుగా పీఎంఎఫ్‌బీవై పోర్టల్ బీమాలో మొబైల్ నుంచి కూడా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

బుక్కపట్నం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఈనెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని స్థానిక డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 9 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం తదితర ఆరు అంశాల్లో ఈనెల 9న బుక్కపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను, రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. వివరాలకు 9440944737 నంబరులో సంప్రదించాలని కోరారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

పది ద్విచక్రవాహనాలు, పది తులాల బంగారు ఆభరణాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాల వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

గుంతకల్లుటౌన్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలు, ద్విచక్రవాహనాలు దొంగతనం చేసిన ముగ్గురిని కసాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కసాపురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం డీఎస్పీ ఎ.శ్రీనివాస్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన బి. వంశీ, మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన సుదికుంట హేమంత్‌కుమార్ కసాపురం, గుంతకల్లు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించారు. వచ్చిన సమాచారం మేరకు మధ్యాహ్నం వీరిని పక్కీరప్ప కాలనీలోని శివాలయం వద్ద కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఉమామహేశ్వర్ నగర్‌కు చెందిన షేక్షావలి, అతడి సోదరుడు మస్తాన్ గుంతకల్లు వన్‌టౌన్, కసాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇళ్లలో దొంగతనాలు చేశారు. షేక్షావలిని డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని భవానీ గుడి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి పది తులాల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన పల్సర్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మస్తాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యానికి ఇక చెల్లు..!

- సచివాలయంలో సిబ్బంది ఉండాల్సిందే
- ఉదయం, సాయంత్రం ముఖహాజరు తప్పనిసరి
- ఒకపూట హాజరు వేస్తే సెలవు కింద లెక్కే
- విధులకు డుమ్మాకొట్టే వారి ఆటలకు ఇక చెక్



ధర్మవరంలోని వార్డు సచివాలయం

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇకపై సచివాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీలులేదు. సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి... ఇష్టం వచ్చినప్పుడు వెళ్లేవారు. ప్రజలకు సరిగా అందుబాటులో ఉండేవారు కాదు. దీంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ఆ కార్యాలయంలోనే ఉండేలా చర్యలు తీసుకుంది. రెండు పూటలా సచివాలయాల్లో ముఖహాజరు వేసేలా చర్యలు తీసుకుంది.

హాజరు తప్పనిసరి

సచివాలయ ఉద్యోగులకు ముఖహాజరు తప్పనిసరి చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు పద్ధతి అమల్లో ఉన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఓ పూట యాప్‌లో హాజరు వేసుకొని.. వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు ఆ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ప్రతి ఉద్యోగి రోజూ రెండు పూటలా యాప్‌లో హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10గంటలకు కచ్చితంగా సచివాలయానికి చేరుకుని హాజరు వేయాలి. ఆ తరువాత సాయంత్రం 5గంటలకు యాప్‌లో హాజరు వేసుకున్న తరువాత తిరిగి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయం ఉన్న కో ఆర్డినేట్స్‌కు 500 మీటర్లలోపే వేయాలి. ఎక్కడో కూర్చొని హాజరు వేసుకుందాములే అంటే వీలు కాదు. రెండు పూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి ఆ రోజు విధులకు హాజరైనట్టు పరిగణిస్తారు. ఇప్పటివరకూ రోజులో ఒక పూట హాజరు వేసి సచివాలయ సిబ్బంది వెళ్లిపోయే వారు. కొందరు విధులకు డుమ్మాకొట్టేవారు. పనివేళల్లో సచివాలయాల్లో ఉండేవారు కాదు.

సిబ్బంది నిర్లక్ష్యం

జిల్లాలో 544 వార్డులు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 4517 మంది ఉద్యోగులున్నారు. ఒక్కో సచివాలయంలో సరాసరి పది విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారు. ప్రజలకు ఏ పని జరగాలన్నా ముందు సచివాలయానికే వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడి సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తుండటం, వేళాపాళా లేకుండా విధులకు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చిన్న పనికి కూడా సామాన్యులు రెండు, మూడు సార్లు సచివాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేంది. మండల స్థాయి అధికారులకు కూడా ఇది సమస్యగా మారింది. సమయపాలన పాటించని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నా వారిలో మార్పురాలేదు. కొందరి నిర్లక్ష్యం వల్ల మొత్తం సచివాలయ వ్యవస్థే అభాసుపాలుఅవుతోంది. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఇటీవల ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టింది. అక్కడి సిబ్బంది ఆ కార్యాలయం తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకొంది.

అమల్లో ముఖహాజరు

ఈ నెల 1న సోమవారం నుంచే రెండు పూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పటికైనా ఆ సిబ్బంది.. కార్యాలయంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యలు పరిష్కరించి.. సుపరిపాలన అందించడానికే సచివాలయాల్లో రెండు పూటలా ముఖహాజరు పద్ధతిని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇదివరకు బయోమెట్రిక్ పద్ధతి ఉండేది. రోజులో ఏదో ఒక సారి హాజరు వేసుకొని వెళ్లిపోయేవారు. ప్రస్తుతం సచివాలయాల్లో ముఖహాజరు తప్పనిసరి అని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

-సుధాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ

సంక్షిప్తం

టీడీపీ సభ్యత్వానికి విరాళాలు


ధర్మవరపు మురళికి నగదు ఇస్తున్న నాయకులు

రాప్తాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాల నమోదు కోసం టీడీపీ మండల నాయకులు విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని బుధవారం టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళికి అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు రూ. 60 వేలు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు రూ. 25 వేలు, గొందిరెడ్డిపల్లి వాటర్‌షెడ్ చైర్మన్ మల్లికార్జున రూ. 20 వేలు, ప్రసన్నాయపల్లి డీలర్ రాము రూ. 10 వేలు అందించారు. సభ్యత్వాల నమోదులో రాప్తాడు మండలాన్ని అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ జాఫర్, టీడీపీ నాయకులు నంబూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న తృతీయ, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 30 వరకు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను సంబంధిత కళాశాలలకు పంపడంతో పాటు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

శింగనమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీఓ శ్రీదేవి ఈసీ తలారి దామోదర్ తెలిపారు. ఐదు ఎకరాలలోపు ఉన్న సన్నకార రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బహువార్షిక పథకం కింద సన్నకార రైతులు 10సెంట్ల నుంచి 50 సెంట్ల పశుగ్రాసం పెంచుకోవచ్చని తెలిపారు. నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం నగదును చెల్లిస్తుందని తెలిపారు. పశువులు ఉన్న ఆసక్తి గల రైతు లు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

నార్పల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యులు టీవీ సుధాకర్, గోవిందరాజు, కే మాధవి మాట్లాడుతూ.. పెయ్య దూడలను పొందే సూదులను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఏహెచ్‌ఏఎస్ అంకిత, ప్రవల్లిక, సంధ్య, గంగాధర్, ఓంకుమార్, సీఎంఎస్ నరసప్ప, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపుల్లో తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పీఎఫ్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉరవకొండ మండలంలోని చిన్న ముస్టూరులో డీలర్ సువర్ణకు చెందిన ఎఫ్‌పీ షాపులో తనిఖీలు చేపట్టారు. స్టాకును, రికార్డుల ను పరిశీలించినట్లు సీఐ జమాల్‌బాషా తెలిపారు. రికార్డులకు, స్టాకుకు వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. భౌతిక నిల్వలను జప్తు చేసి, స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీసీటీఓ సురేష్, ఉరవకొండ సీఎస్‌డీటీ రాము పాల్గొన్నారు.

ఆలయానికి విగ్రహాల కానుక


విగ్రహాలను అందజేసిన దాతలు

గార్లదిన్నె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పలకొండ ఆంజనేయ స్వామి దేవాలయానికి భక్తులు రూ.18లక్షలు విలువగల సీతారామాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలతోపాటు రథాన్ని అందజేశారు. వాణీఅమ్మ బద్రీనారాయణస్వామి దపంతులు వారి కుటుంబ సభ్యులు బుధవారం దేవాలయం అర్చకులకు అందజేశారు. కొప్పలకొండ గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం బెంగుళూరు, హైదరాబాద్, ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. ఉత్సవ విగ్రహాలకు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లమ్మ వెంకట్రాముడు, ఎల్ఐసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

● ఎమ్మెల్యే దగ్గుపాటి సంతాపం

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పదో డివిజన్ టీడీపీ నాయకుడు మున్వర్ (45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు టీడీపీ నాయకులు గంగారామ్, పోతుల లక్ష్మీ నరసింహులు, అశోక్, గుర్రం నాగభూషణం మున్వర్ మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.

ఖాళీగా డీటీ సీటు

● మూడు నెలలుగా ఇదే పరిస్థితి


తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న డీటీ కుర్చీ

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్ తరువాత డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కీలకం. తహసీల్దార్ అందుబాటులో లేక పోయి నా.. .డిప్యూటీ తహసీల్దార్ ఉంటే కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుంది. అటువంటి పోస్టు అనంతపురం రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో రెండు మూడు నెలలుగా ఖాళీ ఉంది. మూడు నెలల కిందట జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తొలుత కలెక్టరేట్‌లో పనిచేసే సోమశేఖర్ అనే అధికారిని ఇక్కడ డీటీగా నియమించారు. కానీ ఆయన విధుల్లో చేరలేదు. కొద్ది రోజులకు శింగనమల కార్యాలయంలో పనిచేస్తున్న ప్రకాష్ రావు అనే అధికారిని నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన కూడా విధుల్లో చేరలేదు. దీంతో తిరిగి శింగనమలకే పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ తర్వాత ఎవరినీ నియమించకపోవడంతో రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సీటు ఖాళీగానే ఉండిపోయింది. రూరల్ మండలంలో కోర్టు కేసులు ఎక్కువ. దీనికితోడు నిత్యం కార్యాలయానికి ప్రజలు తమ సమస్యలపై వస్తుంటారు. ఇక్కడి తహసీల్దార్‌కు నిత్యం మీటింగ్‌లు ఇతరాత్ర వాటికే సమయం సరిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్‌ను నియమిస్తే కొంత ప్రయోజనం ఉటుందని ఇటు కార్యాలయం వర్గాలు, అటు ప్రజలు అంటున్నారు.

తేలని సెంట్రల్‌పార్కు పంచాయితీ

● రోడ్ల కోసం సర్వే చేపట్టిన అధికారులు

● కోర్టులో ఉందంటూ అడ్డుకున్న వైసీపీ నాయకుడు క్రిష్ణమూర్తి

అనంతపురం క్రైం,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సెంట్రల్ పార్కు పంచాయతీ ఇప్పట్లో తేలేలా లేదు. గత కొన్ని సంవత్సరాలుగా వివాదం నడుస్తూనే ఉంది. ఎన్ని సార్లు సర్వే చేసినా అందులో ఆక్రమణ ఎంత..? నగరపాలిక స్థలమెంత..? అనే విషయంలో స్పష్టత ఇవ్వలేకపోయారు. కొన్నిరోజులుగా సెంట్రల్ పార్కులో రోడ్డు ఏర్పాటు చేయటానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే స్పష్టత రావడం లేదు. బుధవారం సర్వే చేయడానికి అధికారులు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ నాయకుడు క్రిష్ణమూర్తి అక్కడికి వచ్చారు. సర్వే నెంబరు 154లో ప్రధానంగా 154/5లో సమస్య ఉందన్నారు. కోర్టు పరిధిలో కొన్ని భూములున్నాయన్నారు. కనీసం నోటీసు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. ఇందుకు సర్వేయర్ రఘు రోడ్లు నిర్మించడం ద్వారా ఆక్రమణలు ఎక్కడున్నాయనేది తెలుస్తుందని, అందులో భాగంగా సర్వే చేస్తున్నామన్నారు. మరెందుకు నోటీసులివ్వలేదని క్రిష్ణమూర్తి ప్రశ్నించారు. అనంతరం అధికారులు, సర్వే సిబ్బంది వెనుదిరిగారు. కాగా కొందరు ఎన్ని సార్లు సర్వే అడ్డుకుంటారని ప్రశ్నించారు. మరికొందరు తాము మరోసారి కోర్టుకెళ్తామని చెప్పుకొచ్చారు.


సర్వేయర్‌కు డాక్యుమెంట్లు చూపుతున్న క్రిష్ణమూర్తి

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో హిందూపురం

●ఎమ్మెల్యే పరిటాల సునీత

● వెంకటాపురంలో సంబరాలు


టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్పకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. వెంకటాపురంలో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. జోన్-5 పరిధిలో 3. 80 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు చేయించి రికార్డు సృష్టించారన్నారు. కేక్‌సుకట్ చేసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్పకు తినిపించి, సన్మానించారు. ఈ సందర్భంగా అంజినప్ప మాట్లాడుతూ... హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొట్టమొదటి సారిగా పరిటాల సునీత వద్ద నుంచే సభ్యత్వ నమోదును ప్రారంభించామన్నారు.దీంతో సంబరాలు కూడా రాప్తాడు నియోజకవర్గంలోనే చేశామ న్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ... సభ్య త్వ నమోదులో రాప్తాడు నియోజకర్గం రాష్ట్రంలో 14వ స్థానం, పార్లమెంట్ పరిధిలో మూడో స్థానంలో ఉం దన్నారు. త్వరలోనే అగ్రస్థానం చేరుకుంటామన్నారు. రెండు మండలాల్లో సభ్యత్వనమోదు తక్కువగా ఉందని వారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ...ధర్మవరం నియోజక వర్గం కూడా రాష్ట్రంలో 14వ స్థానం, పార్లమెంట్‌లో మూడో స్థానంలో ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్య కర్తలు కృషివల్లే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయ కులు రామ్మూర్తి నాయుడు, కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్, పరిశే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు ఘన నివాళులర్పించారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మార్గ్‌లో ఉన్న రోశయ్య విగ్రహనికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రోశయ్య కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యం, జిల్లా నాయకులు శివశంకర్ యాదవ్, ఇమామ్‌వలి, శివారెడ్డి, నరసింహారెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు నిశాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: మాజీ ముఖ్యమంత్రి రోశ య్య ఆశయాలను కొనసా గిస్తామని ఆర్యవైశ్య సం ఘం నాయకులు పేర్కొ న్నారు. రోశయ్య తృతీయ వర్ధంతిని పురస్కరిం చుకుని బుధవారం సాయంత్రం రాణినగర్ లోని రోశయ్య విగ్రహని కి ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్ కోటా సత్యం, కార్యదర్శి తిరువీధుల జగదీష్ కుమార్, యువజన సంఘం అధ్యక్షుడు శబరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమా బాల, మచ్చా మధు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి-4 సెక్షన్ ఏఈఈ మహేష్ తెలిపారు. నాయక్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వెంకటాపురంలో పొలం పిలుస్తోంది

● పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో బుధవారం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై వ్యవసాయాధికారులతో మాట్లాడారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.... ప్రస్తుతం కంది పూత దశ నుంచి కాయ దశ వరకు ఉందన్నారు. ఈ వర్షాలకు పూత రాలే ఆస్కారం ఉందన్నారు. పురుగులు, రోగాలు ఆశించే అవకాశం ఉందన్నారు. దీనికి వ్యవసాయ అదికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వరి పంట గింజ గట్టి పడే పరిస్థితి నుంచి కోత దశకు చేరుతుందన్నారు. ఈ వర్షానికి వరిపంటను కోయవద్దని, కోసిన వారు గింజలు నల్లబడకుండా ఉప్పుద్రావణాన్ని చల్లకోవాలన్నారు. వరిపంట పడిపోతే పొలాల నుంచి నీరు బయటకు తీసివేస్తే గింజలు మొలకెత్తవన్నారు. ఫెంగల్ తుఫాన్ వల్ల వేరుశనగ, మొక్కజొన్న పంటలకు అనుకూలమని ఏరువాక కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉదయ్‌కుమార్, వీఏఓలు నరేశ్, రామ్మోహన్, టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: మండలంలోని ఆకుతోటపల్లి, ఇటుకలపల్లిల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఏఈఓ మురళీకృష్ణ, రైతు సేవా కేంద్ర సహాయకులు పావని, హేమ, టీడీపీ నాయకులు మురళీమోహన్, నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, చింతలయ్య, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె : బ్యాంకు రుణం తీసుకున్న ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయశాఖ ఏడీ ఎం రవి తెలిపారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకులో పంటల కోసం తీసుకున్న రుణం తీసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీసేవలో ప్రీమియం చెల్లించాలని తెలిపారు. మండలంలో అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా త్వరలో రెవెన్యూ వ్యవసాయధికారులు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్ రైతులు పాల్గొన్నారు.

ప్రతి విదార్థి రక్తదానం చేయాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో బాధితులకు పునర్జన్మను ప్రసాదించేలా ప్రతి విద్యార్థి రక్తదానం చేయాలని శ్రీవాణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజమ్మ పేర్కొన్నారు. స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ప్రిన్సిపాల్ వనజమ్మ ప్రారం భించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను ఆమె అభినందించి సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంజి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టకండి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అపార్ జనరేషన్ ప్రక్రియలో విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంతో పాటు ఆధార్ కేంద్రాలు, తపాల కార్యాలయంలోని కేంద్రాల్లో జనం బారులు తీరి ఉంటే, అదనపు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొన్ని కేంద్రాల్లో డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అపార్ జనరేషన్‌లో నెలకొన్న ఇబ్బందులు పరిష్కరించేందుకు మంత్రి నారాలోకేశ్ ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

సభ్యత్వ నమోదును తేలిగ్గా తీసుకోకూడదు

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును తేలిగ్గా తీసుకోకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. అనంతపురం అర్బన్‌లో పార్టీ సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలన్నారు. సభ్యత్వ నమోదును కొందరు నాయకులు తేలిగ్గా తీసుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇందులో ఇబ్బందులు ఏమిటో తనకు తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలను ఎవరైనా ఇబ్బందులు పెట్టినా, తప్పుదారి పట్టించాలని ప్రయత్నించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మనపై నమ్మకంతోనే అనంత అర్బన్‌లో సభ్యత్వ నమోదును పార్టీ అధిష్టానం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదుపై సమీక్షిస్తామ న్నారు. మరో మూడు రోజుల్లో రెట్టింపు స్థాయిలో సభ్యత్వం పెరిగేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

స్వర్ణ పతకం సాధించిన విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ఆర్‌ఐఓ

అనంతపురం విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించిన విద్యార్థి గొట్టుముక్కల శేషసాయిని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. వికాస్ జూనియర్ కళాశాలో ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువు తున్న గొట్టుముక్కల శేషసాయి ఇటీవల నంద్యాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన నున్నాడు. దీంతో కళాశాల డైరెక్టర్ జయ భాస్కర్, సుబ్రహ్మణ్యం, ఇతర అధ్యాపకులు విద్యార్థితో పాటు ఆర్ఐఓను కలువగా...ఆయన విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుత్తి పట్టణంలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ... విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటానికి శ్రీకారం చుట్టి ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నగరాధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షులు సోము, హీను, సాయి, విజయ్, లోకేష్ పాల్గొన్నారు.

చెంగయ్యపై దాడిచేసిన వారిని శిక్షించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్సిటి ప్రొఫెసర్ చెంగయ్యపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ప్రొఫెసర్ చెంగయ్యపై దాడిని ఖండిస్తూ బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన జిల్లా, నియోజక వర్గ అధ్యక్షుడు నాగభూషణం, నాగరాజు, లాయర్ హరిప్రసాద్ మాట్లాడారు. దాడిచేసిన వారిని అరెస్టుచేసి, శిక్షించకపోతే చలో ఎస్కే యూనివర్సిటీ నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు కుళ్లాయప్ప, జిలాన్‌భాష, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రామాంజినేయులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారులో పేకాడుతున్న ఆరుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించిన టీవీటవర్ వెనుక వైపు స్థలంలో పేకాడుతున్న ఆరుమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 18680 స్వాధీనం చేసుకున్నారు.

ఆవిష్కరణల వేదికగా ఫెస్ట్ వేడుకలు

● టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ


విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఆర్జేడీ తదితరులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారి నైపుణ్యాలను ఆవిష్కరణల రూపంలో ప్రదర్శించడానికి ఫెస్ట్ వేడుకలు వేదికలా ఉపయోగపడుతాయని టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ పేర్కొన్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఫెస్ట్-2024 వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి సమన్వయకర్తగా ఏర్పాటుచేసిన టెక్‌ఫెస్ట్‌కు నిర్మల్‌కుమార్‌ప్రియ, డిప్యూటీ సెక్రెటరి వేణుమాధవ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీప్యూటి సెక్రెటరీ వేణుమాదవ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల ఆలోచనలు ప్రదర్శించేలా రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ టెక్‌ఫెస్ట్‌ను ఏర్పాటు చేయించారని తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు చ్రందశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ధీరేంద్రబాబు, శ్రీనివాసరావు, శేఖర్, అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, సుంకన్న, రాంబాబు, ఓంకార్, రఘురామరెడ్డి, బాలచంద్రనాయక్, కరుణకుమార్, నరసింహులు, కిష్టప్ప తదిరులు పాల్గొన్నారు.

అవినీతి గోరంతేనా..?

● జరిగిన పనులు రూ.15 కోట్లు

● తేలిన అవినీతి రూ. 2.07 లక్షలు


ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ 2,07,159 అవినీతి జరిగిందని సామాజిక తనిఖీబృందం సభ్యులు తేల్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామాపీడీ విజయేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు పంచాయతీల వారీగా తనిఖీల వివరాలను వెల్లడించారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వరకు దాదాపు రూ. 15. 02లక్షలు పనులు జరిగాయని తెలిపారు. ఇందుకు సంబంధించి నవంబరు 19వ తేదీ నుంచి ఈ నెల 3 వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో పరిశీలించారని తెలిపారు. ప్రధానంగా ఉపాధిహామీ పథకంలో రెగ్యులర్‌గా జరిగిన పనులతో పాటు హౌసింగ్, హార్టి కల్చర్, సీసీరోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం మొదలైన వాటిపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి రూ. 2,07, 159 మాత్రమే అవినీతి జరిగినట్లు తేలిందని ఏపీఓ గోవిందరాజునాయక్ బహిరంగ చర్చావేదికలో తెలిపారు. మండలంలోని 15 పంచాయతీలకు సంబందించి పులేటిపల్లిలో అధికంగా రూ. 46వేలు, బసినేపల్లిలో అత్యల్పంగా రూ. 3వేలు అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. ఈ అవినీతి సొమ్ము రికవరీకి ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కాగా ఈసామాజిక తనిఖీ తీరుపై మండలంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులుదులుపుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కార్యక్రమంలో డీవీవీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ శివశంకరప్ప, అంబుడ్స్‌మెంటు వెంకటశివారెడ్డి, ఏపీఓ గోవిందరాజ్ నాయక్, ఎస్సార్పీ చంద్రమోహన్, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాదిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

రాప్తాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి అన్ని పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ కుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూ సమస్యలను రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● నార్పల: మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి గ్రామ రెవెన్యూ సదస్సు లు నిర్వహిస్తున్నట్లు డీప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమస్యల్ని ఆ సదస్సులో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

నకిలీ పట్టాలతో పేదలకు మోసం

● వారిపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ


సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాలతో పేదలను మోసం చేసిన ఎస్ నాగభూషణం, ఈడిగ వెంకటేష్‌ను వెంటనే శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆ మేరకు బాధితులతో కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ యోగికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ..ఉప్పరపల్లి పొలంసర్వే నెంబరు 194-8, 215లో తహసీల్దార్ సంతకాలు, సీల్ ముద్రించి నకిలీ పట్టాలతో 200మంది పేద ప్రజలనుమోసం చేశారన్నారు. గతంలోనూ ఎంతో మందిని మోసి చేసినట్లు వారిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈకార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు ప్రసాద్, సుందరాజు, జయలక్ష్మి, చాంద్ భాష, మున్నా, ఇన్సాఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

రాయదుర్గంరూరల్/ యల్లనూరు/ గుంతకల్లుటౌన్/ బెళుగుప్ప : డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 వ తేదీ నుంచి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనుందని, ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని రాయదుర్గం , యల్లనూరు, గుంతకల్లు, బెళుగుప్ప తహసీల్దార్లు నాగరాజు, రాజా, రమాదేవి , షర్మిల బుధవారం ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, అటవీశాఖ సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులు భూసమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక అని అన్నారు. ఉదయం 10కి ప్రారంభమై సాయంత్రం 5:30గంటల వరకు గ్రామసభ ఉంటుందన్నారు. రైతులు రెవెన్యూ సమస్యలుంటే అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

రైల్వేసంఘాలకు గుర్తింపు ఎన్నికలు ప్రారంభం

గుత్తి,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికలను బుధవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వే ఇన్‌స్టిట్యూట్, రైల్వే కమ్యూనిటీ హాల్, ఏడీఎన్ కార్యాలయాల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ, సివిల్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలు మూడు రోజల పాటు ఎన్నికలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా భారత నావికాదళ దినోత్సవం

రాయదుర్గంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత నావికాదళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ నావికాదళ మాజీ ఉద్యోగి ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘు రామమూర్తి మాట్లాడుతూ.. దేశ రక్షణా దళాల్లో నావికాదళం కీలక మైనదని, సముద్రమార్గంలో రక్షణ కవచంగా ఎల్లవేళలా కాపాడుతూ ఉంటుందని, వారి దేశ సేవ కొనియాడదగినదని అన్నారు. తర్వాత విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

చంద్రగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదు


చంద్రగిరిలో సభ్యత్వ చేయిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వం నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించా రు. రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యాన్ని టీడీపీ అధిష్ఠానం కల్పిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. నాయకులు ధనుంజయరెడ్డి, చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామల, పుల్లారెడ్డి, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి: సీఐటీయూ

రాయదుర్గం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో విధుల నుంచి తొలగించిన ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున బుధవారం ప్రకటనలో కోరారు. మండల వ్యాప్తంగా 19 పంచాయతీలలో 2006వ సంవత్సరం నుంచి 19 మంది ఫీల్డు అసిస్టెంట్లుగా విధులను నిర్వర్తిస్తూ వస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలు పంచాయతీల్లోని అధికారపార్టీ నాయకులు రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారన్నారు. దీనిని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తొలగించబడ్డ ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సీపీఎం పట్టణ కమిటీ ఎన్నిక

గుంతకల్లు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం పట్టణ నూతన కమిటీని బుధవారం ఎంపిక చేశారు. స్థానిక సీఐటీయూ కాలనీలో సీపీఎం పట్టణ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మారుతి ప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులుగా బీ శ్రీనివాసులు, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, సురేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈస్ట్ కోడిపల్లిలో పొలం పిలుస్తోంది

కళ్యాణదుర్గం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈస్ట్‌కోడిపల్లిలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, డీడీ హార్టికల్చర్ సజ్జన్ నాయక్, అగ్రికల్చర్ ఎక్స్‌పర్ట్ కిశోర్, టెక్నికల్ ఏవో రాకేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు యల్లప్ప, మండల వ్యవసాయ అధికారి జగదీష్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకృష్ణతేజ పాల్గొని రైతులతో సమావేశం నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ స్థానికంగా పండించిన వేరుశనగకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని, వేరుశనగ కొనుగోలును దళారులు కాకుండా ప్రభుత్వమే ప్రొక్యూర్‌మెంట్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఏడీఏ యల్లప్ప మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఫసల్ బీమా చేసుకునే సదుపాయం వుందని, ఈ నెల 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలని రైతులను కోరారు. రైతు సేవా కేంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపుల్లో తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పీఎఫ్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉరవకొండ మండలంలోని చిన్న ముస్టూరులో డీలర్ సువర్ణకు చెందిన ఎఫ్‌పీ షాపులో తనిఖీలు చేపట్టారు. స్టాకును, రికార్డుల ను పరిశీలించినట్లు సీఐ జమాల్‌బాషా తెలిపారు. రికార్డులకు, స్టాకుకు వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. భౌతిక నిల్వలను జప్తు చేసి, స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ సురేష్, ఉరవకొండ సీఎస్‌డీటీ రాము తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాదర్శుల సమాఖ్య నాయకులు బుధవారం కంబదూరు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర భౌతికాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర బుధవారం ఆత్మహత్య చేసుకున్నారన్న సమాచారం అందిన వెంటనే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో కంబదూరులోని రాఘవేంద్ర నివాసానికి వెళ్లారు. అక్కడ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, సాంబశివ, రవికుమార్, గోపాల్, రామాంజి, బాషా, నవీన్, అశోక్, తిమ్మరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

గుంతకల్లుటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శివమాలధారులు శ్రీశైలం క్షేత్రానికి బుధవారం పాదయాత్రగా బయలు దేరారు. ముందుగా స్థానిక రెడ్డి వీధిలోని రాతిగుడి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకున్నారు. తర్వాత స్వామికి పూజలు చేసి శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరారు. గురుస్వాములు కృష్ణారెడ్డి, వాల్మీకి రాముడు మాట్లాడుతూ 34వ సారి శివమాల ధరించి శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్నామని తెలిపారు. సుమారు 64 మంది పాదయాత్రగా వెళ్లారు.


పాదయాత్రగా బయలుదేరిన శివమాలధారులు

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూపులు

- డబ్బులు కట్టి ఏడాదైనా మంజూరుకాని వైనం
- మండల వ్యాప్తంగా 289 మంది రైతుల నిరీక్షణ
- బోర్లలో నీళ్లున్నా పంటలు పండించలేకపోతున్నామంటూ ఆవేదన


యాడికిలో ఓ వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం దిమ్మెను సిద్ధం చేసుకున్న రైతులు

యాడికి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుబావులకు కరెంట్ కనెక్షన్‌ల కోసం మండలంలోని అన్నిగ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వహయాంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, అయితే ఇప్పటి వరకూ తమకు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే యాడికి కరువు మండలమని, సాగునీరు దొరకడం అతికష్టమని, ఏదో అదృష్టం కొద్దీ పొలాల్లో నీళ్లు పడ్డాయని, పంటలు సాగుచేసుకుని తమ జీవితాలు బాగు చేసుకుందామనుకుంటే బోరుబావులకు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో పచ్చని పంటపొలాలు ఉండాల్సిన తమ భూములు బీళ్లుగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. నెలల తరబడి ట్రాన్స్‌కో అధికారుల చుట్టూ తిరుగుతున్నా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వడం లేదని తీవ్రవిమర్శలు వస్తున్నాయి. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే.. మెటీరియల్ రాలేదు మేమేమి చేయాలంటూ అధికారులు ఎదురుప్రశ్న వేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇంకా గట్టిగా నిలదీస్తే సీరియల్ ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ వస్తుందని, అంతవరకు ఉండాల్సిందేనంటూ సమాధానం చెబుతున్నారన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో సిఫారసులు ఉన్న వారికి మాత్రం వారంరోజులలోపే ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చారని, ఇందుకు సంబంధించి అప్పట్లో ప్రజా ప్రతినిధి ఇచ్చిన సిఫారసు లేఖను సైతం రైతులు చూపడం గమనార్హం. అధికారుల తీరు ఇలాఉంటే సామాన్యరైతుల పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు తగుచర్యలు చేపట్టి ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే మంజూరుచేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

289మంది రైతుల ఎదురుచూపు

మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది నుంచి దాదాపు అన్ని గ్రామాల నుంచి 289మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. వారానికి ఒకసారి ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లడం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయిందో లేదో అని ఆరాతీయడం చేస్తున్నారు. తర్వాత ఇంకా రాలేదని తెలుసుకుని నిరాశగా వెనుదిరుగుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి ఉంటే ఈ పాటికి రెండు పంటలు కూడా పండించుకొనే వాళ్లమని రైతులు తెలుపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు ఇంకా ఎన్నిరోజులు వేచిచూడాలో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగునెలలుగా ఎదురుచూపులు



ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసి నాలుగునెలలు పైగా అవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ లేక బోరుబావిని వృథాగా పెట్టుకోవాల్సి వస్తోంది. ట్రాన్స్‌కో అధికారులను అడిగితే అదిగో ఇస్తాం... ఇదిగో ఇస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. సీరియల్ నెంబర్ల జాబితా చేంతాడంత ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరులో సిఫారసులకు ప్రాధాన్యం ఇవ్వకుండా జాబితా ప్రకారం రైతులందరికి ట్రాన్స్‌ఫార్మర్‌లు అందించేలా చర్యలు చేపట్టాలి.

-రామాంజనేయులు, చందన గ్రామం

మెటీరియల్ రావాల్సి ఉంది



ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సీరియల్ నెంబరు ప్రకారం అందజేస్తాం. బోరుబావికి కనెక్షన్ ఇవ్వడానికి మెటీరియల్ రావాల్సి ఉంది. బహుశా ఈనెలాఖరుకు మెటీరియల్ రావచ్చు. ఇప్పటివరకు 289మంది రైతులు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. మెటీరియల్ రాగానే సీరియల్ ప్రకారం రైతులకు అందజేసిన బోరుబావికి కనెక్షన్ ఇస్తాం.

- రాజారావు, ఇన్‌చార్జి ఏఈ, ట్రాన్స్‌కో

15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి


గుత్తిలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి/ ఉరవకొండ/ రాయదుర్గం రూరల్/ కణేకల్లు: డిసెంబరు 4(ఆంధ్రజ్యో తి): రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఫసల్‌బీమా యోజన పథకం వర్తింపునకు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. గుత్తి పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రైతులు మామిడి, టమోటా, వేరుశనగ, పుష్పశనగ, మొక్కజొన్న, జొన్న, వరిపంటలపై బీమా కోసం ప్రీయమిం చెల్లించాలన్నారు. ప్రీమి యం చెల్లించిన వారికి భవిష్యత్తులో పకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే ప్ర భుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. ప్రీమియంను రైతులు కామన్ సర్వీసు సెంటర్‌లో చెల్లించి రసీదు పొంది భద్రపరుచుకోవాలన్నారు. టమోటా, మామిడికి మాత్రం గడువు ఈనెల 31వరకూ ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, హార్టికల్చర్ అధికారి మిత్రవింద, ఎంపీఓలు పాల్గొన్నారు.

●ఉరవకొండ మండలం లత్తవరంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శుభకర్ మాట్లాడారు. ఫసల్ బీమా యోజన కింద ఈనెల 15వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు.

● రాయదుర్గం మండలం 74 ఉడేగోళం రైతు సేవాకేంద్రంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఏడీఏ లక్ష్మానాయక్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది రబీలో పంటలు సాగు చేసిన రైతులకు ఫసల్‌బీమా యోజన కోసం ఈ నెల 15వ తేదీలోగా బీమాప్రీమియం చెల్లించాలని తెలపాలన్నారు.

●కణేకల్లు మండల వ్యాప్తంగా ఉన్న పప్పుశనగ రైతులు ఫసల్‌బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని, బీమాప్రీమియంను ఈనెల 15వతేదీలోపు చెల్లించాలని. ఏఓ శ్రావణ్‌కుమార్ ప్రకటనలో కోరారు.

పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోండి

రాయదుర్గంటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటల్ నిర్వాహకులు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర సూచించారు. స్థానిక కణేకల్లు రోడ్డు పరిసర ప్రాంతంలో గల పలు హోటళ్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీలు, మున్సిపల్ సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. బాలాజీ హోటల్, రుచి రెస్టారెంట్, ఎ1 కబాబ్ సెంటర్, బళ్లారి ధమ్ బిర్యాని సెంటర్‌లను తనిఖీ చేసి చుట్టుపక్కల ప్రాంతాలను శుభంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే ఆహార పదార్థాలను శుభ్రమైన ప్రదేశాల్లో ఉంచాలని, వంటనూనెలను ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా ప్రతి రోజూ ఫ్రెష్ ఆయిల్‌ను వినియోగించాలని సూచించారు. హోటల్ నిర్వాహకులు పద్ధతి మార్చుకోకపోతే ప్రజారోగ్య చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

గుత్తి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ.. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో కరెంట్ చార్జీలు ఎట్టిపరిస్థితిలో పెంచమని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పుడు మాట మార్చడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలన్నారు. అనంతరం ఏడీఈకు వినతి పత్రం అందజేశారు. మండల కన్వీనర్ హుసేన్‌పీరా, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఐ ఆందోళన

కణేకల్లు : రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మండల కార్యదర్శి గౌస్‌పీరా మాట్లాడుతూ.. రైతులకు భారంగా మారే విధంగా స్మార్ట్‌మీటర్లు పెట్టడం సబబు కాదన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బషీర్ అహ్మద్, సర్మాస్‌వలి, చందాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే రాళ్లపై జగన్ పేరు తొలగింపు

బ్రహ్మసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెలిమేపల్లి గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే రాళ్ల మీద నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును ముద్రించింది. ప్రభుత్వం మారిన దృష్ట్యా ప్రస్తుత కూటమి ప్రభుత్వం సదరు రాళ్లపై జగన్ పేరును తొలగించాలని ఆదేశించింది. దీంతో సచివాలయం సర్వేయర్ మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం రాళ్లపై పేరును తొలగించారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు


జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

యాడికి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. జ్యోతులను దేవర ఇంటివద్ద నుంచి నిర్వాహకులు ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. బస్టాండ్ సర్కిల్, పెద్దమ్మ ఆలయం, వైశ్యావీధి, మార్కెట్‌వీధి గుండా జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వాటిని చౌడేశ్వరి అమ్మవారికి సమర్పించారు. జ్యోతుల ఊరేగింపును చూడడానికి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, తొగటవీర క్షత్రియులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దవడుగూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గల కాసేపల్లి టోల్‌ప్లాజా వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. పామిడి పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే తరలిస్తున్న సురేంద్ర అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

యువతికి ఆర్థికసాయం

తాడిపత్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం రోడ్డులో నివాసం ఉంటున్న జయశ్రీ అనే యువతికి బుధవారం రూ.50వేలు ఆర్థికసాయం అందజేసినట్లు బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గత సోమవారం ఆమె ఆలయంలో వలంటరీ సేవకు గాను తెల్లవారుజామున 4గంటలకు ఇంటి నుంచి బైక్ బయలుదేరి వస్తుండగా.. వీధికుక్కలు వెంటపడడంతో అదుపుతప్పి విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో జయశ్రీ కాలు విరగడంతోపాటు తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జయశ్రీకు ఆర్థికసాయం అందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. దీంతో సొంత నిధులను సమకూర్చి జయశ్రీ ఇంటివద్దకు వెళ్లి నగదును అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలోని అమోఘ హోటల్ వద్ద బుధవారం తెల్లవారుజామున 3:30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఇందులో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ శివకుమార్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆటోలో అనంతపురానికి చెందిన వారు బాట సుంకులమ్మ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతిబావివంక గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జయనాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడులు చేసి అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 7 వేల నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ బుధవారం తెలిపారు. మండలంలోని దొనులుడికి గ్రామానికి చెందిన సురేఖ పట్టణంలోని క్రెడిట్ యాక్సిస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తోందని, కాగా మంగళవారం మధ్యాహ్నం పాత గుత్తిరోడ్డులోని మణికంఠ గ్యాస్ వద్ద భర్త రఘురాముడుకు డ్యూటీ పనిమీద దౌల్తాపురం వెళ్తున్నానని చెప్పి వెళ్లిందని, అనంతరం తిరిగి రాలేదని, ఆమె భర్త టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ఆయతపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పోలిరెడ్డి(50) బళ్లారి విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలిరెడ్డి గత మూడురోజుల క్రితం ద్విచక్రవాహనంలో గుమ్మఘట్టకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా 75 వీరాపురం గ్రామం వద్ద కుక్క అడ్డం రావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. దీంతోతీవ్ర గాయాలవడంతో రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి, తర్వాత బళ్లారి విమ్స్‌కు తరలించారు. కాగా అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు గుమ్మఘట్ట పోలీసులు తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

ఉరవకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం షష్ఠి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు దివాకర్ శర్మ, నాగరాజు శర్మ వేకువజామునే స్వామి మూల విరాట్‌కు 11కేజీల తేనేతో అభిషేకించి, ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. సాయంత్రం ధ్వజారోహణం చేపట్టారు.

యాడికి కాలువకు త్వరలో నీరు విడుదల: ఎమ్మెల్యే


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

యాడికి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు త్వరలో నీటిని విడుదల చేసేదిశగా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి తెలిపారు. పెద్దవడుగూరు మండలంలోని కిష్టిపాడు గ్రామం వద్ద నుంచి యాడికి మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామం వరకు ఉన్న యాడికి కాలువను బుధవారం ఆయన పరిశీలించారు. కాలువ మొత్తం పిచ్చిమొక్కలు ఉండడంతో వెంటనే వాటిని తొలగించే పనులను చేపట్టాలని టీడీపీ మండల నాయకులను ఆదేశించారు. యాడికి కాలువకు నీటిని విడుదల చేస్తే నీటిపారుదలకు ఎక్కడైనా ఆటంకాలు ఏర్పడతాయా అనే వివరాలను ఆరాతీశారు. కాలువ వెంబడి మొక్కలను వెంటనే తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని, తాను పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. త్వరలోనే యాడికి కాలువకు నీటిని విడుదల చేసే దిశగా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

దుకాణాల నిర్వాహకులతో జేసీపీఆర్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూపర్‌మార్కెట్‌లోని దుకాణాల నిర్వాహకులతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఈ సూపర్ మార్కెట్‌ను మోడ్రన్‌గా తీర్చిదిద్దాలనుకున్నామన, అయితే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. సూపర్‌మార్కెట్‌లో దాదాపు 72రూములు ఉండగా వాటిలో 32మందే షాపులు నిర్వహిస్తున్నారన్నారు. మిగతా 40షాపులు ఇతరత్రా వారు బాడుగలకు తీసుకున్నారన్నారు. ఇకపై ఇలా జరగకుండా ఎవరెవరు షాపులు రూముల్లో ఉన్నారో వారే నిర్వహించాలన్నారు. షాపు రూములు ఖాళీగా పెట్టేపరిస్థితిలో లేమన్నారు. ముఖ్యంగా ఇక్కడ పరిశుభ్రత సరిగా లేదని, ఇలా అయితే ఈ మార్కెట్‌ను ఎలా తీర్చిదిద్దగలమని ఆవేదన వ్యక్తం చేశారు. నెలాఖరికి కమిటీని ఏర్పాటు చేసుకుని కాంప్లెక్స్‌ను ఒక మోడ్రన్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. పలువురు టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగరాదు

గుంతకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న హనుమద్ వ్రతం సందర్భంగా మాలాధారులకు, భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. కసాపురం దేవస్థానంలో హనుమద్ వ్రత ఏర్పాట్లపై బుధవారం ఆయన స్థానిక శ్రీరామదూత నిలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మాలాధారులకు విడిది, భోజన, తాగునీటి వసతులు, భక్తుల రద్దీ నియంత్రణ, క్యూలైన్ నియంత్రణ, పోలీసు భద్రత, శానిటేషన్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖలవారూ సమన్వయంతో పని చేసి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఆలయ ఈఓ వాణి, డీఎస్పీ ఏ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్త సుగుణమ్మ, పోలీసు, ఫైర్, విద్యుత్, మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారాన్ని త్వరలోనే అందిస్తాం: ఆర్డీఓ

పెద్దపప్పూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో అనంతపురం నుంచి విజయవాడకు వెళ్ల ప్రధాన రహదారి కోసం వ్యవసాయ భూములు, నివాసగృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేస్తామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. గ్రామంలో బుధవారం ఆయన గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయం చెప్పారు. త్వరలోరు నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ బాలాజీరాజు, ఆర్‌ఐ ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు స్థల పరిశీలన

యాడికి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేయనున్న కమలపాడు పంప్డ్‌స్టోరేజ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు స్థలాన్ని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. సుమారు 874.70ఎకరాల విస్తీర్ణంలో కమలపాడు పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి కుందనకోట, కమలపాడు రెవెన్యూ పంచాయతీల పరిధిలో స్థలాలను గుంతకల్లు ఆర్డీఓ పరిశీలించి వివరాలను ఆరాతీశారు. ఆయన వెంట తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'సర్పంచుల హక్కులను కాలరాసింది వైసీపీనే '

ఉరవకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ హక్కులను కాలరాసింది వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ సర్పంచులు ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వ పేర్కొనడంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుతంలో సర్పంచ్‌ల నిధులు కూడా పక్కదారి పట్టాయన్నారు. కూటమిపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. సర్పంచులు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, తిమ్మరాజు, రామ్మోహన్, భూపతి పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో యువకుడి మృతి


బోయ సురేంద్ర మృతదేహం

బనగానపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో గుంతకల్లు మండలం పాత కొచ్చెరువుకు చెందిన బోయసురేంద్ర (27) మృతిచెందాడు. ఆయన తన స్నేహితులతో కలిసి యాగంటి క్షేత్రానికి స్వామి దర్శనానికి వచ్చాడు. అక్కడి కోనేటిలో స్నానమాచరించిన తర్వాత ఆలయ ఆవరణలో కింద పడి కుప్పకూలాడు. దీంతో స్నేహితులు బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. స్నేహితులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కుందుర్పి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కుసుమగిరి వికలాంగుల మండల సమాఖ్య అధ్యక్షుడు సజ్జల వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా దివ్యాంగులు స్థానిక రామస్వామి ఆలయం నుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ రుషి డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా అఖిల భారతీయ దివ్యాంగుల సేవాసంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, దృష్టి ప్రముఖ్ విజయభాస్కర్, తహసీల్దార్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు మేనేజర్ ప్రకాష్, రుషి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, సర్పంచ్ మారుతీశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా కలిసి పోరాడాలని సూచించారు. నాయకులు మహంతపురం లక్ష్మీ, మర్రిస్వామి, శ్రీనివాసులు, గోవింద నాయుడు, యువరాజు, సిబ్బంది పాల్గొన్నారు.